# మోదీపై వ్యక్తిగత వ్యాఖ్యలు సహించం



**బీజేపీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజు యాదవ్**

**నల్లగొండ, జిల్లా అక్టోబరు 27: వుదయం**

నల్గొండ పట్టణ కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడాన్ని సహించబోమని బీజేపీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజు యాదవ్ అన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లి కార్జున ఖర్గే వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ జాతీయ పార్టీ పిలుపు మేరకు మంగళవారం నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్‌లో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పిల్లి రామరాజు యాదవ్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి మోదీపై విమర్శలు చేయాలనుకుంటే అభివృద్ధి, పాలన, ప్రజా సమస్యల ఆధారంగా చేయాలని సూచించారు. వ్యక్తిగత వ్యాఖ్యలతో రాజకీయాలు చేయడం ప్రజాస్వామ్యానికి ఆరోగ్యకరమైన పద్ధతి కాదన్నారు. ప్రజా సమస్యలు, ఉపాధి, రైతుల ఇబ్బందులు, సంక్షేమంపై చర్చించకుండా వ్యక్తిగత విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు పోతేపాక సాంబయ్య, 25వ డివిజన్ కార్పొరేటర్ వంగూరి రాఖీ, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రావెళ్ల కాశమ్మ, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి యానాల కర్ణాకర్‌రెడ్డి, యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బోడిగ భరత్, వన్‌టౌన్ కన్వీనర్ పెరిక నరసింహ, జి. చెన్నారం ఉపసర్పంచి ఉప్పునూతల వెంకన్న, నాయకులు ఊటుకూరి వెంకట్‌రెడ్డి, లకడా పురం వెంకన్న, ఆకునూరి సత్యనారాయణ, కుంభం వెంకట్‌రెడ్డి, కళ్యాణ్, ఉపేందర్, చింతపల్లి వెంకన్న, పండగ లింగస్వామి, జక్కల శంకర్, దొండ ముఖేష్, ముత్యాల శంకర్‌రెడ్డి, బీపంగి చంటి, ఆది శీను, శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం..?

- తాగునీరు వృథా.. నీట మునుగుతున్న వరి పంట!
- అధికారుల అలసత్వానికి రైతుల పంట బలి.. లీకేజీని అరికట్టేదెవరు?

**కల్లూరు,అక్టోబర్ 27 (వుదయం ప్రతినిధి)**

ఒకవైపు ఆరుగాలం కష్టపడి పంటను కాపాడుకుంటున్న రైతులు.. మరోవైపు అధికారుల నిర్లక్ష్యంతో కళ్లముందే దెబ్బతింటున్న వరి చేలు! కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని పుల్లయ్య బంజర్ రోడ్డులో రామ్‌నగర్ కాలనీ సమీపంలోని వరి పొలాల వద్ద మిషన్ భగీరథ తాగునీటి పైప్‌లైన్ లీకేజీ రైతులకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. పైప్‌లైన్ నుంచి వేలాది లీటర్ల తాగునీరు వృథాగా ప్రవహిస్తూ పక్కనే ఉన్న వరి పొలాల్లోకి చేరుతోంది. దీంతో పంట దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రైతుల కష్టం అధికారులకు కనిపించడం లేదా?**

రేయింబవళ్లు కష్టపడి, పెట్టుబడులు పెట్టి పంటను సాగు చేస్తున్న రైతులకు ఇప్పుడు ఈ పైప్‌లైన్ లీకేజీ కొత్త కష్టాన్ని తెచ్చిపెట్టింది. పంట చేతికి వస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్న తరుణంలో, అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమ పంట నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. తమ కష్టార్జితం కళ్లముందే దెబ్బతింటుంటే చూస్తూ ఉండాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. లీకేజీని వెంటనే అరికట్టి పంటను కాపాడాలని కోరుతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**తాగునీరు వృథా.. రైతులకు కన్నీళ్లు!**

ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించాలని ప్రభుత్వం సూచిస్తోంది. కానీ, మిషన్ భగీరథ పైప్‌లైన్ నుంచి తాగునీరు వృథాగా ప్రవహిస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ప్రజలకు అందించాల్సిన తాగునీరు వృథా అవుతుండగా, అదే నీరు పొలాల్లోకి చేరి రైతులకు నష్టాన్ని కలిగించే పరిస్థితి నెలకొంది.

**ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలి!**

రైతుల పంటకు మరింత నష్టం వాటిల్లక ముందే సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు. లీకేజీని అరికట్టడంతో పాటు, పంటకు జరిగిన నష్టాన్ని పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. రైతుల కష్టాలను, ప్రజల తాగునీటి అవసరాలను విస్మరించే అధికారుల తీరుపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారా? లేక రైతుల ఆవేదన అరణ్యరోదనగానే మిగిలిపోతుందా? అన్న ప్రశ్నకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.



# ఎల్నినో సంసిద్ధత పై అవగాహన మరియు మెగా ఉచిత పశు వైద్య శిబిరం

**చిలుకూరు అక్టోబర్ 27:(వుదయం)**



మండల కేంద్రంలోని పశు వైద్య కేంద్రంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ముఖ్య అతిథిగా జాతీయ మాంస పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ బర్బుదే. సూర్యాపేట జిల్లా పశువైద్యాధికారి బి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ కొల్లు పుల్లమ్మ నాగయ్య, ప్రారంభించారు, ఈ సందర్భంగా. 72 పశువులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు, రైతులు సేంద్రియ మాంసం, పాల ఉత్పత్తిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎల్నినో ప్రభావాన్ని తట్టుకుంటూ అదనపు ఆదాయం కోసం పాడి రైతులు కోళ్లు, మేకల పెంపకాన్ని చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో, సీనియర్ శాస్త్రవేత్త బసవారెడ్డి, సహాయ సంచలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రూప కుమార్, డాక్టర్ పెంటయ్య, డాక్టర్ వీరారెడ్డి, డాక్టర్ మధు, డాక్టర్ సురేష్, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సమాజం భద్రత కోసం పోలీసుల సేవలు వెలకట్టలేనివి

**కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్.పి అక్షాంక్షు యాదవ్**

**యాదాద్రి భువనగిరి జిల్లా. వుదయం ప్రతినిధి**



దేశం , సమాజం భద్రత కోసం పోలీసుల సేవలు వెల కట్టలేనివని ,వారి త్యాగాలు చిర స్మరణీయం అని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్.పి అక్షాంక్షు యాదవ్ పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ నుంచి రైల్వే స్టేషన్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మంగళవారం సాయంత్రం చేపట్టిన సైకిల్ ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ ముందు వరుసలో సైకిల్ పై పట్టణ ప్రధాన రహదారి నుంచి సాగింది. అక్టోబర్ 21 నుంచి వారోత్సవాల్లో భాగంగా జిల్లాలు అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ఎస్పీ వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పి లు లక్ష్మీనారాయణ, వినోద్ కుమార్, డీఎస్పీలు రవీందర్, శ్రీనివాస్ నాయుడు, సిఐలు వెంకటేశ్వర్లు, శంకర్, చంద్రబాబు, భాస్కర్ జిల్లాలోని పోలీస్ స్టేషన్ల ఎస్సైలు పోలీసు సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**రాష్ట్ర కాంగ్రెస్ అగ్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్**

**కల్లూరు,అక్టోబర్ 27 (వుదయం ప్రతినిధి)**



రాబోయే రెండు మూడు రోజులపాటు ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉ న్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాల ని రాష్ట్ర కాంగ్రెస్ అగ్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. వాగులు, వంకలు, నదులు, రిజర్వాయర్లు, చెరువుల వద్దకు వెళ్లకూడదని, మత్స్యకారులు చేపల వేటకు దూరంగా ఉండాలని సూచించారు. వరద నీటిలో రహదారులు దాటే ప్రయత్నం చేయవద్దని, తెగిపడిన విద్యుత్ తీగలను తాకకూడదని, ఈదురుగాలుల సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడకూడదని తెలిపారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని కోరారు. వాతావరణ హెచ్చరికలను గమనిస్తూ అధికారుల సూచనలు పాటించాలని, ప్రజలందరూ తమ ప్రాణ భద్రతకు ప్రాధాన్యమివ్వాలని డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ పేర్కొన్నారు.

# భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి దేవస్థానానికి భారీ విరాళం

**అన్నదానం, శాశ్వత కల్యాణం, గోశాల నిర్వహణకు రూ.15.30 లక్షల విరాళం**

**భద్రాచలం 27/10/26 వుదయం ప్రతినిధి:**



భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తుడు శ్రీ కశ్యప్ రాజేష్ పటేల్ గారు భారీ విరాళాన్ని అందించి తన భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. శ్రీ సీతారామచంద్రస్వామి వారి సేవలో భాగంగా దేవస్థానంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి, శాశ్వత కల్యాణ సేవకు, గోశాల నిర్వహణకు ఆయన మొత్తం రూ.15,30,000లను విరాళంగా అందించారు. భగవంతుని సేవతో పాటు భక్తులకు సేవలందించాలనే సత్సంకల్పంతో ఇంతటి భారీ విరాళాన్ని అందించడం విశేషంగా నిలిచింది.

**అన్నదాన కార్యక్రమానికి రూ.9 లక్షలు విరాళ**

అన్నదాన కార్యక్రమం నిర్వహణ నిమిత్తం శ్రీ కశ్యప్ రాజేష్ పటేల్ గారు రూ.9,00,000లు భారీ విరాళంగా అందించారు. ఆకలితో ఉన్నవారికి అన్నం అందించడం మహోన్నతమైన సేవగా భావించబడుతుంది. అలాంటి అన్నదాన కార్యక్రమానికి పెద్ద మొత్తంలో విరాళాన్ని అందించడం ద్వారా ఆయన తన భక్తిభావాన్ని, సేవా దృక్పథాన్ని చాటుకున్నారు.

**శాశ్వత కల్యాణ సేవకు రూ.75 వేల విరాళం:**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో నిర్వహించే శాశ్వత కల్యాణ సేవకు కూడా శ్రీ కశ్యప్ రాజేష్ పటేల్ గారు రూ.75,000లు విరాళంగా అందించారు. శ్రీ సీతారాముల కల్యాణం భక్తులకు ఎంతో పవిత్రమైన ఆధ్యాత్మిక వేడుక. ఈ పవిత్రమైన కల్యాణ సేవకు విరాళాన్ని అందించడం ద్వారా ఆయన స్వామివారి కైంకర్యాలకు తన వంతు సహకారాన్ని అందించారు. గోశాల నిర్వహణకు రూ.5.55 లక్షల విరాళం: అదేవిధంగా దేవస్థాన గోశాల నిర్వహణ నిమిత్తం శ్రీ కశ్యప్ రాజేష్ పటేల్ గారు రూ.5,55,000లు భారీ విరాళంగా అందించారు. భారతీయ సంస్కృతిలో గోసంరక్షణకు ఎంతో విశిష్టమైన స్థానం ఉంది. గోవులను సంరక్షించడం, వాటి పోషణకు తోడ్పడటం పవిత్రమైన సేవగా భావిస్తారు. గోశాల నిర్వహణకు ఇంతటి మొత్తాన్ని విరాళంగా అందించడం ద్వారా ఆయన గోసేవ పట్ల తనకున్న భక్తిని, సేవాభావాన్ని చాటుకున్నారు. మొత్తం రూ.15.30 లక్షల భారీ విరాళం: అన్నదాన కార్యక్రమానికి రూ.9,00,000లు, శాశ్వత కల్యాణ సేవకు రూ.75,000లు, గోశాల నిర్వహణకు రూ.5,55,000లు కలిపి మొత్తం రూ.15,30,000లను శ్రీ కశ్యప్ రాజేష్ పటేల్ గారు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి భారీ విరాళంగా అందించారు.

భక్తులకు అన్నప్రసాదం అందించడం, స్వామివారి కల్యాణ కైంకర్యాలకు సహకరించడం, గోసంరక్షణకు తోడ్పడటం వంటి మూడు పవిత్రమైన కార్యక్రమాలకు ఆయన విరాళం అందించడం విశేషం. దేవస్థానంలో నిర్వహించే ధార్మిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకు భక్తులు అందించే విరాళాలు ఎంతో విలువైనవి. భక్తులు తమ శక్తి మేరకు స్వామివారి సేవలో భాగస్వాములు కావడం ద్వారా దేవస్థాన సేవా కార్యక్రమాలకు అండగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు చెందిన శ్రీ కశ్యప్ రాజేష్ పటేల్ రూ.15.30 లక్షల భారీ విరాళాన్ని అందించడం పట్ల పలువురు భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్రీ సీతారామచంద్రస్వామివారి దివ్య ఆశీస్సులు ఆయనకు, ఆయన కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ ఉండాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

# చండూరులో 'సర్' పై ఎలక్షన్ అబ్జర్వర్, కలెక్టర్ రాజకీయ నాయకులతో సమీక్ష

**చండూరు,అక్టోబర్ 27(వుదయం):**



మునుగోడు నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియను పక్కాగా, పారదర్శకంగా నిర్వహించడమే లక్ష్యంగా అధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ (సర్ – SIR) కార్యక్రమంపై ఉన్నతాధికారులు విస్తృత స్థాయి సమావేశం చేపట్టారు.ఈ సమీక్షా సమావేశంలో ఎన్నికల పరిశీలకురాలు (Election Observer) దేవసేన, ఐఏఎస్, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ పాల్గొని అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, తప్పుల దిద్దుబాటు మరియు ఈఆర్వో (ERO)ల పరిధిలో జరుగుతున్న పనుల పురోగతిని అధికారులు సమగ్రంగా పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కా ప్రణాళికతో ముందడుగు వేయాలని, ఓటర్ల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అబ్జర్వర్ దేవసేన, కలెక్టర్ బి. చంద్రశేఖర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో నియోజకవర్గానికి చెందిన ఈఆర్వోలు, ఆర్డీవో వందనపు శ్రీదేవి, డిపీఆర్వో వెంకటేశ్వర్లు, ఎమ్మార్వో రమాకాంత్ శర్మ ,రెవెన్యూ అధికారులు వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# సర్వోత్తమరెడ్డి విజయానికి కృషి చేయాలి

**జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్**

**చింతకాని, అక్టోబర్ 27 (వుదయం ప్రతినిధి):**

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రామిరెడ్డి సర్వోత్తమరెడ్డి విజయం కోసం కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణగౌడ్, మధిర నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంఛార్జ్ పొట్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు చింతకాని మండల కాంగ్రెస్ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కన్నెబోయిన గోపి యాదవ్ అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ వచ్చే నెల 6వ తేదీ వరకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు గడువు ఉందని, అర్హులైన గ్రాడ్యుయేట్లందరితో ఓటు నమోదు చేయించేలా నాయకులు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మత్కేపల్లి ఏఎంసీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, తెల్లబల్లి సాయి, జల్లావత్ మణిపాల, మడిపల్లి భాస్కర్, గంగరాజు, ఎస్.కె అబ్దుల్, బందెల నాగరాజు, యడ్లపల్లి శ్రీనివాసరావు, ఓర్సు వీరభద్రం, జోనల్ ఇంఛార్జీలతో పాటు పలువురు మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# అమరవీరులకు నివాళిగా.. తలసేమియా చిన్నారులకు రక్తదానం!

**కోదాడలో రక్తదాన శిబిరం.. రక్తదానం చేసిన మునగాల ఎస్ఐ సంజీవరెడ్డి**

**మునగాల, అక్టోబర్ 27 (వుదయం):**



విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసి అమరులైన పోలీసు వీరులకు తెలంగాణ ప్రజల తరపున వినమ్ర నివాళులర్పిస్తూ పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కోదాడ సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. కోదాడ డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరంలో మునగాల ఎస్ఐ మల్లు సంజీవరెడ్డి రక్తదానం చేసి సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మునగాల పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన యువకులు కూడా శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు రక్తం ఎంతో అవసరమని, వారికి రక్తాన్ని అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని ఈ కార్యక్రమం చాటి చెప్పింది. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

# ప్రతిభకు గుర్తింపు.. జర్నలిజానికి గౌరవం!



**నవ తెలంగాణ రాష్ట్ర వర్క్‌షాప్‌లో సూర్యాపేట విలేకరి జహంగీర్ కు ఘన సన్మానం**

**సూర్యాపేట అక్టోబర్ 28, వుదయం ప్రతినిధి**

నవ తెలంగాణ దినపత్రికలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ, ప్రజా సమస్యలపై నిరంతరం అక్షరయాత్ర కొనసాగిస్తున్న సూర్యాపేట విలేకరి జహంగీర్ కు అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన నవ తెలంగాణ దినపత్రిక రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లో ఆయనను ఘనంగా సన్మానించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ , నవ తెలంగాణ సీజీఎం పి. ప్రభాకర్ , ఎడిటర్ రాంపల్లి రమేష్ చేతుల మీదుగా మెమెంటో అందజేసి అభినందించారు. వృత్తి పట్ల అంకితభావం, ప్రజా పక్షాన నిలబడి వార్తలు రాయడం, స్థానిక సమస్యలను రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లడంలో జహంగీర్ చూపిస్తున్న కృషికి ఈ గుర్తింపు లభించింది. గత కొంతకాలంగా సూర్యాపేట జిల్లాలో ప్రజా సమస్యలు, రైతు సమస్యలు, విద్య, వైద్య రంగాలపై ఆయన రాస్తున్న కథనాలు పాఠకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

ఈ సన్మానం పట్ల జహంగీర్ హర్షం వ్యక్తం చేశారు. "ఈ గుర్తింపు నాకు మరింత బాధ్యతను పెంచింది. ప్రజా పక్షాన అక్షరయాత్రను మరింత బలంగా కొనసాగిస్తాను" అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా రీజియన్ మేనేజర్ మట్టయ్య , డెస్క్ ఇంచార్జి వరుణ , అడ్వర్టైజ్మెంట్ ఇంచార్జి వెంకట్ రెడ్డి , స్టాఫ్ రిపోర్టర్ సాధక్ అలీ తదితరులు పాల్గొన్నారు. జిల్లాకు చెందిన పలువురు జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు జహంగీర్ కు అభినందనలు తెలిపారు.

# జీఎంఆర్ టౌన్ షిప్ లో 600 మొక్కలు నాటిన అక్షర ఫౌండేషన్

**హరితహారం లో పాల్గొన్న డీఎఫ్ఓ దామోదర్ రెడ్డి**

**సూర్యాపేట, అక్టోబర్ 27: వుదయం ప్రతినిధి**



అక్షర ఫౌండేషన్ సూర్యాపేట ఆధ్వర్యంలో, వేద కిడ్నీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఆభరణ జ్యువెలర్స్ సూర్యాపేట వారి సహకారంతో జీఎంఆర్ టౌన్ షిప్, కుడకుడలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అటవీశాఖ అధికారి కె. దామోదర్ రెడ్డి, మోరిశెట్టి లక్ష్యాది పాల్గొని మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా కె. దామోదర్ రెడ్డి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం ఎంతో ముఖ్యమని అన్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పులు, వర్షపాతంలో అనిశ్చితి వంటి సమస్యలను ఎదుర్కోవడానికి పచ్చదనం పెంపొందించాలని సూచించారు. ఎల్ నినో వంటి వాతావరణ పరిణామాలు రుతుపవనాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున నీటి పొదుపు, వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

ఈ హరితహారం కార్యక్రమంలో మామిడి, సపోటా, కొబ్బరి, నిమ్మ, రావి, మర్రి, విప్ప, కానుగ, పండ్ల మొక్కలు, పూల మొక్కలు, షో మొక్కలు, నీడనిచ్చే చెట్లు మొదలగు 600 మొక్కలు నాటారు. ఇలాంటి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమానికి సహకరించిన వేద కిడ్నీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఆభరణ జ్యువెలర్స్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ షఫీ ఉల్లా, అక్షర ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు రుద్రంగి కాళిదాస్, నరాల తిరుమలరెడ్డి, కాంగ్రెస్ నాయకులు గునగంటి సతీష్, చింతరెడ్డి రామలింగారెడ్డి, ఉప్పు నాగయ్య, బత్తుల దామోదర్ రెడ్డి, కే నారాయణ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఎస్కే నజీర్ భాషా, గౌరిశెట్టి అప్పారావు, చామకూరి కిరణ్, దేవరకొండ సాయికుమార్, గడ్డం వీరబాబు, జటంగి ముత్తయ్య మరియు అక్షరా ఫౌండేషన్, టౌన్ షిప్ సభ్యులు పాల్గొన్నారు.

# చేనేత వజ్రం..ఢిల్లీ పీఠంపై తెలుగు మహిళ జయభేరి!

- ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు డైరెక్టర్‌గా కర్నాటి వజ్రమ్మ వెంకటేశం ఏకగ్రీవ ఎన్నిక
- గట్టుప్పల్ నుంచి హస్తిన దాకా సాగిన విజయయాత్ర
- తెలంగాణ చేనేత చరిత్రలోనే నూతన అధ్యాయం

**గట్టుప్పల్, అక్టోబరు 27(వుదయం):**



గ్రామీణ ప్రాంతం నుంచి ఎదిగి.. హస్తిన స్థాయిలో హ్యాండ్లూమ్ రంగాన్ని ఏలే స్థాయికి చేరి చరిత్ర సృష్టించారు గట్టుప్పల్ చేనేత సహకార సంఘం అధ్యక్షురాలు కర్నాటి వజ్రమ్మ వెంకటేశం. ఢిల్లీ కేంద్రంగా జరిగిన 'ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ కో-ఆపరేటివ్ సొసైటీ' బోర్డు డైరెక్టర్ ఎన్నికల్లో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికై విజయదుందుభి మోగించారు. ఇటీవల జరిగిన చేనేత రాష్ట్ర ప్రతినిధుల ఎన్నికల్లో విజయం సాధించిన వజ్రమ్మ, ఆ తర్వాత బోర్డు డైరెక్టర్ పదవికి పోటీపడ్డారు. తన వ్యూహాత్మక అడుగులతో వివిధ రాష్ట్రాల సభ్యుల మద్దతును కూడగట్టి, ఎవరి పోటీ లేకుండా ఏకగ్రీవంగా డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. ఒక సాధారణ గ్రామ స్థాయి చేనేత సహకార సంఘం అధ్యక్షురాలి నుంచి జాతీయ స్థాయి బోర్డు డైరెక్టర్‌గా ఎదిగి చరిత్ర పుటల్లో నిలిచారు.వజ్రమ్మ సాధించిన ఈ ఘన విజయంపై చేనేత రంగానికి చెందిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ చేనేత మహిళకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఆమెకు అభినందనల నీరాజనాలు అర్పించారు. కర్నాటి వజ్రమ్మ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మద్దతు తెలిపిన వివిధ రాష్ట్రాల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఢిల్లీ స్థాయిలో మన రాష్ట్రంలోని చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకురావడానికి, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# చర్లలో ఘనంగా జాతీయ మాల మహానాడు 20వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**చర్ల, అక్టోబర్ 27: (వుదయం ప్రతినిధి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలో జాతీయ మాల మహానాడు 20వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర జాతీయ మాల మహానాడు అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆదేశాల మేరకు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుమల్ల సుందర్ రావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా అధ్యక్షులు తోటమల్ల రమణమూర్తి, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ఎడెల్లి గణపతి జాతీయ మాల మహానాడు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు తోటమల్ల రమణమూర్తి మాట్లాడుతూ, 2006 అక్టోబర్ 27న తెలంగాణ మాల మహానాడుగా ఆవిర్భవించిన ఈ సంఘం అప్పటి నుంచి వర్గీకరణ వ్యతిరేక ఉద్యమంతో పాటు తెలంగాణ ఉద్యమం, పలు సామాజిక ఉద్యమాల్లో క్రియాశీలకంగా పాల్గొంటూ వచ్చిందన్నారు. మాలల హక్కుల పరిరక్షణ కోసం సంఘం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా మాలలపై జరిగే అన్యాయాలు, దాడులను సహించబోమని స్పష్టం చేశారు. ఎక్కడ మాలలకు అన్యాయం జరిగినా జాతీయ మాల మహానాడు అండగా నిలుస్తుందని, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. మాలల ఐక్యతే సంఘానికి బలమని పేర్కొంటూ, రానున్న రోజుల్లో గ్రామ గ్రామాన జాతీయ మాల మహానాడును మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. మాలల హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తామని, మాల యువత సంఘంలో చేరి సామాజిక చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు నాయకులు కారంపూడి సాల్మన్ రాజ్, తోటమల్ల గోపాలరావు, మేడబత్తిని గోవర్ధన్, నిట్ట అబ్బులు, రుంజా సుమన్, కర్రి సంతోష్, చీతరగడ్డ రవి, తోటమల్ల వెంకటేశ్వర్లు (వెంకన్న), నిట్ట దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటే కీలక ఆయుధం: ధర్మార్జున్

**ఎమ్మెల్సీ ఓటర్ నమోదు హెల్ప్ డెస్క్ ప్రారంభం**

**సూర్యాపేట అక్టోబర్ 28 , వుదయం ప్రతినిధి**



ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటే కీలక ఆయుధమని, పట్టభద్రులంతా తమ ఓటు నమోదు చేసుకుని ఎన్నికల ప్రక్రియలో క్రియాశీలక పాత్ర పోషించాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, సూర్యాపేట నియోజకవర్గ ఇంచార్జ్ ధర్మార్జున్ పట్టభద్రులకు పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ జన సమితి జిల్లా కార్యాలయంలో విద్యార్థి, యువజన సమితి సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ హెల్ప్ డెస్క్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మార్జున్ మాట్లాడుతూ... ఒకవైపు సర్ పేరుతో దేశంలో తమను వ్యతిరేకించే సమూహాల ఓట్లను తొలగిస్తున్నారని, దేశంలో 13 కోట్ల ఓట్లు, తెలంగాణలో లక్షలాది ఓట్లు తొలగిస్తున్నారని, ఎన్నికల కమిషన్, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కలిసి కుట్రకు తెగబడ్డాయని విమర్శించారు.

మరోవైపు చైతన్యవంతులైన విద్యావంతులు రాజకీయాలపై అసంతృప్తితో, నాయకులు చేస్తున్న అవినీతి, అక్రమాలపై ద్వేషంతో ఓటు నమోదుకు దూరంగా ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "ఇంట్లో ఎలుకలు ఉన్నాయని ఇంటిని తగలబెట్టకోము. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు గట్ల రమాశంకర్, యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు నారబోయిన కిరణ్ ముదిరాజ్, జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ గౌడ్, విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షులు వినయ్, నాయకులు వెంకటరెడ్డి, సతీష్, హరీష్, మునీష్, నాగేందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# వేసంగిలో వరి సాగు వద్దు.. ఆరుతడి పంటలకే ప్రాధాన్యం!

**తాగునీటి అవసరాలకే తాలిపేరు జలాలు వినియోగించాలి: ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు**

**చర్ల, అక్టోబర్ 27: (వుదయం ప్రతినిధి)**



సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలున్న నేపథ్యంలో రైతులు వేసంగిలో ఎట్టి పరిస్థితుల్లోనూ వరి పంట సాగు చేయవద్దని భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని రైతులకు పిలుపునిచ్చారు. మంగళవారం భద్రాచలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నీటి పారుదల, వ్యవసాయ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న వేసంగి సీజన్‌లో నీటి వినియోగం, పంటల సాగు ప్రణాళికపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. తాలిపేరు ప్రాజెక్టులో అందుబాటులో ఉన్న నీటిని కేవలం తాగునీటి అవసరాలకే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. కరవు పరిస్థితులు ఏర్పడే అవకాశాలను ముందుగానే అంచనా వేసి, నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పశువులకు సైతం మేత, నీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వేసంగిలో వరి సాగుకు బదులుగా పప్పుధాన్యాలు, నువ్వులు, జనుములు, పశుగ్రాస పంటల సాగుకు రైతులు ప్రాధాన్యం ఇచ్చేలా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామస్థాయిలో, క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై వివరించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే ఆదేశాలకు అనుగుణంగా వేసంగి పంటలకు సాగునీరు విడుదల చేయకుండా, తాగునీటి అవసరాలకు మాత్రమే తాలిపేరు జలాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు స్పష్టం చేశారు. అలాగే వేసంగి వరి సాగును ప్రోత్సహించే విధంగా విత్తనాల సరఫరా జరగకుండా చూడాలని, ప్రైవేటు విత్తన కంపెనీలు కూడా ప్రభుత్వ సూచనలను పాటించాలని కోరారు. రానున్న రోజుల్లో ఎదురయ్యే నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖ డివిజనల్ ఇంజనీర్ తిరుపతి, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## అర్నాబ్ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- తుఫాన్ ప్రభావంతో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే సమాచారం అందించాలి
- ప్రజలకు అందుబాటులో కంట్రోల్ రూమ్.. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు
- భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ



**భద్రాచలం,27/10/26 వుదయం ప్రతినిధి:**

అర్నాబ్ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకంగా తుఫాన్ హెచ్చరికల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుఫాన్ ప్రభావం కారణంగా భద్రాచలం డివిజన్ పరిధిలోని మండలాలు, గ్రామాల్లో ఏవైనా సమస్యలు తలెత్తితే ప్రజలు వెంటనే అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ఈ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. తుఫాన్ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకొని సంబంధిత ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, ప్రజలకు అవసరమైన సమాచారం అందించడంతో పాటు సమస్యలను అధికారులకు తెలియజేసేందుకు కంట్రోల్ రూమ్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. భద్రాచలం డివిజన్ పరిధిలోని అన్ని మండలాలు, గ్రామాల ప్రజలు తుఫాన్ పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తమ ప్రాంతాల్లో ఎదురయ్యే సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. ముఖ్యంగా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసినా, వరద పరిస్థితులు ఏర్పడినా, రహదారులపై రాకపోకలకు ఇబ్బందులు ఎదురైనా, ప్రజలకు ఇతర అత్యవసర సమస్యలు తలెత్తినా వాటిని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని కోరారు.

ప్రజల నుంచి అందే సమాచారాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు ఈ కంట్రోల్ రూమ్ ద్వారా అవకాశం ఉంటుందని తెలిపారు. తుఫాన్ హెచ్చరికల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండటం, పరిస్థితులకు అనుగుణంగా జాగ్రత్తలు పాటించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు ఆలస్యం చేయకుండా అధికారులకు సమాచారం అందించడం ద్వారా సత్వర చర్యలు తీసుకునేందుకు వీలవుతుందని వివరించారు.

భద్రాచలం డివిజన్ పరిధిలోని ప్రజలు తమ ప్రాంతాల్లో తలెత్తే సమస్యలు, ఇబ్బందులను తెలియజేయడానికి సబ్ కలెక్టర్ కార్యాలయ కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 08743-232444ను సంప్రదించాలని సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ సూచించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు కూడా అధికారులకు సహకరిస్తూ తమ ప్రాంతాల్లో పరిస్థితులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆమె కోరారు. తుఫాన్ పరిస్థితులపై ప్రజలు నిర్లక్ష్యం వహించకుండా, అప్రమత్తతతో వ్యవహరిస్తూ అధికారుల సూచనలను పాటించాలని ఈ సందర్భంగా తెలిపారు.

## జిల్లాలో రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలి



**జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందించిన డీలర్లు**

**నల్గొండ జిల్లా అక్టోబర్ 27 వుదయం ప్రతినిధి**

నల్గొండ పట్టణ కేంద్రంలో జిల్లాలో రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, గౌరవ వేతనం, కమిషన్ పెంపు, ఉచిత దిగుమతి, తూకంతో బియ్యం పంపిణీ తదితర సమస్యల పరిష్కారంపై విజ్ఞప్తి. పై విషయమును పురస్కరించుకొని తమరికి మనవి చేయుట ఏమనగా.. మా యొక్క రేషన్ డీలర్ల సమస్యలను తమకు సవినయంగా తెలియజేయుచున్నాము. మినీ స్టాక్ పాయింట్లలో ప్రకటించినట్లుగా మాకు రూ.5,000 గౌరవ వేతనం మరియు క్వింటాళ్లకు రూ.300 కమిషన్‌ను అమలు చేయాలి. ఫుడ్ సెక్యూరిటీ చట్టం ప్రకారం రేషన్ షాపుల వద్దకు సరుకులను ఉచితంగా పంపిణీ చేయాలి. (ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలులో ఉన్నది.) ప్రతి గోదాం నుంచి వస్తున్న బియ్యం ఖచ్చితంగా కాంటా వేసి ఇవ్వాలి. గత 20 నెలలుగా డోర్ డెలివరీ నిల్వలు దుకాణాల్లోనే ఉండిపోవడం వల్ల, క్వింటా బియ్యానికి 10 శాతం తరుగు సరిచేసి ఇవ్వాలి. డీలర్లపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షులు పారేపల్లి నాగరాజు జిల్లా కోశాధికారి కోటగిరి సత్యనారాయణ మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షులు పగిళ్ల వెంకటేశ్వర్లు దేవరకొండ డివిజన్ అధ్యక్షులు కుర్ర శంకర్ నాయక్ నల్గొండ డివిజన్ అధ్యక్షులు పి సత్తిరెడ్డి వివిధ మండల గ్రామాల డీలర్లు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పాఠశాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ప్రతిరోజూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూను సక్రమంగా అమలు చేయాలి
- వంట సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు వంటగదిని శుభ్రంగా ఉంచుకోవాలి
- కేజీబీవీ పాఠశాల ఆకస్మిక తనిఖీలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ ఆదేశాలు



**భద్రాచలం,27/10/26 వుదయం ప్రతినిధి:**

పాఠశాలల్లో విద్యార్థినులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంతో పాటు వారి ఆరోగ్యం, సంక్షేమం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ సంబంధిత అధికారులకు సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ స్థానికంగా అందుబాటులో ఉండి విద్యార్థినులకు చక్కటి విద్యాబోధన అందించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ సమయానికి నాణ్యమైన ఆహారాన్ని వేడిగా ఉన్నప్పుడే వడ్డించాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రత, వంటశాల నిర్వహణ, విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణ, భద్రతా ఏర్పాట్ల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. మంగళవారం భద్రాచలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ, మారుమూల ఆదివాసీ, గిరిజన గ్రామాల నుంచి అనేక ఇబ్బందులను అధిగమించి విద్యార్థినులు పాఠశాలకు వచ్చి చదువుకుంటున్నారని, అలాంటి విద్యార్థినులు తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని అన్నారు. విద్యార్థి దశ ఎంతో విలువైనదని, ఈ దశలో సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లలో చాటింగ్ చేయడం, అనవసరంగా సందేశాలు పంపడం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని, చదువుకు ఆటంకం కలిగించే విషయాలపై సమయాన్ని వృథా చేయవద్దని హితవు పలికారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ఎంతో నమ్మకంతో వారిని హాస్టళ్లలో చేర్పించి, ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో మంచి స్థాయికి చేరుకుంటారని ఆశిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థినులు తమ తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టేలా కష్టపడి చదివి, అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని, తమ కుటుంబాలకు, చదువుకున్న పాఠశాలకు, తమ గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థినుల భద్రత విషయంలో ప్రత్యేక అప్రమత్తత అవసరమని సబ్ కలెక్టర్ సూచించారు. బాలికల పాఠశాల కావడంతో బయటి వ్యక్తులు అనుమతి లేకుండా పాఠశాల ప్రాంగణంలోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాచ్‌మన్ 24 గంటల పాటు అప్రమత్తంగా ఉంటూ పాఠశాల భద్రతను పర్యవేక్షించేలా సంబంధిత ప్రిన్సిపాల్, వార్డెన్ చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థినులకు నిర్ణీత సమయానికి వేడివేడి భోజనం అందేలా చూడాలని, ఆహార పదార్థాల నాణ్యత విషయంలో రాజీ పడకూడదని పేర్కొన్నారు. పాఠశాలలోని అన్ని విభాగాలను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, విద్యార్థినుల సంక్షేమానికి సంబంధించిన సమస్యలను గుర్తించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. కేజీబీవీ పాఠశాలల ప్రధాన లక్ష్యం మారుమూల ప్రాంతాలకు చెందిన బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన వసతి, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమేనని, ఆ లక్ష్యానికి అనుగుణంగా పాఠశాల నిర్వహణ ఉండాలని సూచించారు. విద్యార్థినులకు విద్యాబోధన, భోజనం, వసతి, పారిశుద్ధ్యం, భద్రత వంటి అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు తలెత్తినట్లయితే వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో ఉపాధ్యాయులు, వార్డెన్లు, ఇతర సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ సూచించారు. ఈ తనిఖీలో కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్, వార్డెన్ లీల, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 1న 'ఛలో ఢిల్లీ' ర్యాలీకి కాంగ్రెస్ శ్రేణులు కదం తొక్కాలి

- ఎల్‌నినో ప్రభావంపై ప్రజలు ముందస్తుగా అప్రమత్తంగా ఉండాలి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలి
- భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



**భద్రాచలం,27/10/26 వుదయం ప్రతినిధి:**

భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన భద్రాచలం మండల స్థాయి కాంగ్రెస్ పార్టీ సమావేశానికి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న 'ఓట్ బచావో – దేశ్ బచావో' నిరసన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అదే విధంగా ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తలెత్తే వాతావరణ పరిస్థితులపై ప్రజలు ముందస్తుగా అప్రమత్తంగా ఉండాలని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎల్‌నినో ప్రభావం, ముందస్తు సన్నద్ధత, ఓటు హక్కుల పరిరక్షణ, SIR ప్రక్రియ, 'ఓట్ బచావో – దేశ్ బచావో' కార్యక్రమం, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పలు కీలక అంశాలపై ఎమ్మెల్యే వివరంగా మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో వచ్చే ఏడాది ఏప్రిల్, మే నెలల్లో తీవ్ర వాతావరణ పరిస్థితులు, నీటి ఎద్దడి వంటి సమస్యలు తలెత్తే అవకాశాలున్న నేపథ్యంలో ప్రజలు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సూచించారు.

రాజ్యాంగం దేశ పౌరులకు కల్పించిన ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. SIR ప్రక్రియ పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌ను అడ్డం పెట్టుకొని ఓట్ల తొలగింపునకు పాల్పడుతోందని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోందని తెలిపారు. ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్లకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడి ఓటుకు సమాన విలువ ఉంటుందని, అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పోరాటం కొనసాగిస్తోందని వివరించారు.

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వంలో 'ఓట్ బచావో – దేశ్ బచావో' నినాదంతో ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉద్యమిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి భద్రాచలం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు, ఓటర్ల హక్కులను పరిరక్షించేందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

**పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే దిశానిర్దేశం**

భద్రాచలం మండల స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించడం, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడం వంటి అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. గ్రామాలు, వార్డుల స్థాయిలో ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ వారి సమస్యలను తెలుసుకోవాలని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కుల సంరక్షణ, పట్టభద్రుల ఓటరు నమోదు, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. సమావేశంలో భద్రాచలం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు, బూత్ లెవెల్ ఏజెంట్లు (BLAలు), మహిళా నాయకురాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలి!

**బీఆర్ఎస్ నాయకుల డిమాండ్**

**మునగాల, అక్టోబర్ 27 (వుదయం):**



త్వరలో జరగనున్న నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నవంబర్ 6వ తేదీ వరకు మాత్రమే గడువు ఉన్నందున, మునగాల తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక ఓటరు నమోదు కౌంటర్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మునగాల పీఏసీఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, మండల అధ్యక్షుడు తొగరు రమేష్ డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నమోదు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తులను మంగళవారం పార్టీ నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నెలరోజుల పాటు అవకాశం కల్పించినప్పటికీ, ప్రభుత్వ యంత్రాంగం క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించకపోవడంతో ఆశించిన స్థాయిలో స్పందన రావడం లేదని పేర్కొన్నారు. గడువు ముగియడానికి కొద్ది రోజులే మిగిలి ఉన్నందున అధికారులు తక్షణమే స్పందించి మండలంలోని పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని కోరారు. పట్టభద్రులు ఇబ్బందులు పడకుండా తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి, ఓటరు నమోదు ప్రక్రియను ఉచితంగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన పట్టభద్రులందరూ గడువులోగా తమ పేర్లను నమోదు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మునగాల గ్రామశాఖ అధ్యక్షుడు ఉడుం కృష్ణ, సుంకరి అజయ్ కుమార్, ఎల్పీ రామయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా కలప తరలిస్తున్న వాహనాలు సీజ్

**దమ్మపేట అక్టోబర్ 27 (వుదయం ప్రతినిధి):**



దమ్మపేట రేంజ్ పరిధిలోని ముస్తిబండ బీట్‌లోని గణేష్‌పాడు ప్రాంతంలో అక్రమంగా తరలిస్తున్న మిస్సీ ఫవుడ్ లారీని అటవీ శాఖ అధికారులు తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నారు. సదరు లారీలో సుమారు 5.5 టన్నుల అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. అదే విధంగా, అచ్యుతాపురం బీట్ పరిధిలోని చీపురుగూడెం ప్రాంతంలో అక్రమంగా మిస్సీ ఫవుడ్ తరలిస్తున్న ట్రాక్టర్‌ను అటవీ శాఖ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. ఈ ట్రాక్టర్‌లో సుమారు 4.5 టన్స్ ఉన్నట్లు గుర్తించారు. ఈ రెండు ఘటనల్లో మొత్తం సుమారు 9 టన్నుల తరలిస్తున్న రెండు వాహనాలను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకుని, సంబంధిత కేసులు నమోదు చేశారు. అనంతరం వాహనాలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. అటవీ సంపదను అక్రమంగా తరలించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై అటవీ శాఖ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## పట్ట భద్రులంతా ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

**బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు జానకి రామాచారి**

**చిలుకూరు అక్టోబర్ 27:(వుదయం)**



ఖమ్మం–వరంగల్–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా. కోదాడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆదేశాల మేరకు చిలుకూరు మండలంలోని నారాయణపురం పాలేన్నారం గ్రామాలలో ఓటు ఎన్రోల్మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జానకి రామాచారి, మాట్లాడుతూ, 2023 లోపు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు ప్రజాస్వామ్యంలో ఓటు అనేది వజ్రాయుధం లాంటిదని ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకుంటేనే ప్రభుత్వాన్ని నిలదీసే హక్కు మనకుంటుందని ఓటరుగా నమోదు చేసుకోకపోతే ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఉండదని ప్రభుత్వ ఫలాలు కూడా పొందే అర్హత లేదని మనకోసం పనిచేయని ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలంటే ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకొని వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని సూచించారు ఈ కార్యక్రమంలో, మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యులు షేక్ జాన్మియా, గ్రామ పార్టీ అధ్యక్షుడు సోమ గాని రాజశేఖర్, పోలే బోయిన లక్ష్మీనారాయణ, గంధ్ర సుధాకర్, దేశ బోయిన సైదులు, కొండ నందు, తదితరులు పాల్గొన్నారు,

## పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ బైక్ ర్యాలీ



**చిలుకూరు అక్టోబర్ 27 :(వుదయం)**

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా చిలుకూరు ఎస్ఐ, మోహన్ బాబు, ఆధ్వర్యంలో, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో స్థానిక ప్రజలు పాల్గొని విధి నిర్వహణలో తమ ప్రాణాలను త్యాగం చేసిన పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రజలకు గుర్తుచేయడంతో పాటు, వారి సేవలు, అంకితభావం, ధైర్యసాహసాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశమని ఎస్సై తెలిపారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని, విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించిన అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల త్యాగస్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, పోలీసులకు ప్రజలు సహకరిస్తూ సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, పోలీస్ స్టేషన్ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే ఏడాది ఖమ్మం జిల్లా ఆదాయ లక్ష్యం 59 వేల కోట్లు

- ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జీఎఫ్ఎస్టీ వైస్ చైర్మన్ ఎస్పీ టక్కర్
- జిల్లా ఆర్థిక వృద్ధి వేగవంతానికి వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలపై ప్రత్యేక కార్యాచరణ
- పెట్టుబడులను త్వరితగతిన కార్యరూపంలోకి తీసుకురావాలి
- వ్యవసాయ రంగం ఆదాయాన్ని పెంచేలా ప్రణాళిక
- మహిళా స్వయం సహాయక సంఘాల ఆదాయం, ఉపాధి అవకాశాలు పెంచాలి

**ఖమ్మం, వుదయం బ్యూరో అక్టోబర్ -27**



ఖమ్మం జిల్లా ఆర్థిక వ్యవస్థను వచ్చే ఏడాది నాటికి 59 వేల కోట్లకు చేర్చే లక్ష్యంతో అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జీఎఫ్ఎస్టీ వైస్ చైర్మన్ ఎస్పీ టక్కర్ అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా అభివృద్ధి ప్రణాళిక తయారీపై సంబంధిత అధికారులతో జీఎఫ్ఎస్టీ వైస్ చైర్మన్ ఎస్పీ టక్కర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, ఖమ్మం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అభివృద్ధి ప్రణాళిక తయారీ కోసం ఏర్పాటు చేసిన 11 గ్రూపులకు సంబంధించిన నోడల్ అధికారులను ప్రత్యేక అధికారికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ టక్కర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి ప్రణాళికను స్థానిక పరిస్థితులు, ప్రజల అవసరాలు, అందుబాటులో ఉన్న వనరులు, ఆర్థిక అవకాశాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించాలని సూచించారు.

**ఆదాయాన్ని రూ. 59,000 కోట్లకు పెంచాలి:**

ఖమ్మం జిల్లా స్థూల జిల్లా దేశీయోత్పత్తి గత ఏడాది సుమారు 46 వేల కోట్లుగా ఉండగా, ప్రస్తుతం 52 వేల కోట్లకు చేరిందని, వచ్చే ఏడాది 57 వేల కోట్లకు చేరుతుందని అంచనా ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది జిల్లా ఆర్థిక వ్యవస్థను 59 వేల కోట్లకు చేర్చే లక్ష్యంతో కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఇందుకోసం ఆదాయ వృద్ధిని వేగవంతం చేసి, అన్ని రంగాల్లో సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో తలసరి ఆదాయం సుమారు రూ. 3.30 లక్షలుగా ఉందని, రాష్ట్ర తలసరి ఆదాయంతో పోలిస్తే జిల్లాలో ఇంకా అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని తెలిపారు. జిల్లా ఆదాయ వృద్ధి సుమారు 15 శాతం స్థాయిలో ఉండేలా వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలకు స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించాలని సూచించారు.

**వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలకు ప్రాధాన్యం:**

జిల్లాలో ఎక్కువ మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నప్పటికీ, ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం వాటా తక్కువగా ఉందని ఎస్పీ టక్కర్ పేర్కొన్నారు. ప్రాథమిక రంగంపై సుమారు 64 శాతం మంది కార్మికులు ఆధారపడు తుండగా, జిల్లా స్థూల విలువ జోడింపులో ఈ రంగం వాటా సుమారు 24.2 శాతంగా ఉందని వివరించారు. ద్వితీయ రంగం వాటా సుమారు 12.9 శాతం కాగా, సేవా రంగం వాటా సుమారు 63 శాతంగా ఉందన్నారు. ఎక్కువ మంది ఆధారపడుతున్న వ్యవసాయ రంగంలో రైతుల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు తయారీ, పారిశ్రామిక, సేవా రంగాలను విస్తరించాలని సూచించారు. హోటళ్లు, రవాణా, ఇతర సేవలకు సంబంధించిన రంగాల్లో ఉన్న అవకాశాలను వినియోగించు కోవాలని, తద్వారా ఉపాధి అవకాశాలు, ప్రజల ఆదాయం పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు.

ఖమ్మం ఐటీ టవర్‌లో ప్రస్తుతం ఎంతమంది పనిచేస్తున్నారు, ఇంకా ఎన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చు అనే వివరాలను సేకరించాలని సూచించారు. ఐటీ టవర్–2 నిర్మాణానికి అవసరమైన ప్రణాళికను సిద్ధం చేయాలని, భవిష్యత్తులో ఐటీ రంగం ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. తయారీ రంగం, సేవా రంగం రెండూ సమాంతరంగా అభివృద్ధి చెందేలా ప్రణాళిక రూపొందించాలని, స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ అందించి పరిశ్రమలు, ఐటీ, ఇతర సేవా రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**వ్యవసాయ ఆదాయాన్ని పెంచాలి:**

వ్యవసాయ రంగం ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచేందుకు పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని టక్కర్ సూచించారు. సంప్రదాయ పంటలతో పాటు ఉద్యానవన పంటలు, ఆక్వాకల్చర్, పశుసంవర్ధక రంగాలను ప్రోత్సహించాలని తెలిపారు. రైతులకు అధిక ఆదాయం అందించే పంటల ఎంపిక, ఆధునిక సాగు పద్ధతులు, మార్కెటింగ్ సదుపాయాలపై కార్యాచరణ రూపొందించాలన్నారు.

**11 గ్రూపుల ద్వారా సమగ్ర అభివృద్ధి ప్రణాళిక:**

జిల్లా అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ఏర్పాటు చేసిన 11 గ్రూపులు తమ పరిధిలోని అంశాలను సమగ్రంగా అధ్యయనం చేసి, అందుబాటులో ఉన్న గణాంకాలు, ప్రస్తుత పరిస్థితులు, అభివృద్ధి అవకాశాల ఆధారంగా లక్ష్యాలను నిర్దేశించు కోవాలని సూచించారు.

శిశు మరణాల రేటు (ఐఎంఆర్), మాతృ మరణాల రేటు (ఎంఎంఆర్) వంటి కీలక సూచికలకు సంబంధించి అందుబాటులో ఉన్న సమాచారాన్ని విశ్లేషించి, ఆరోగ్య, పోషకాహార రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ప్రతి రంగంలో సాధించాల్సిన లక్ష్యాలు, వాటి అమలుకు తీసుకోవాల్సిన చర్యలు, పురోగతిని కొలిచే ప్రమాణాలు స్పష్టంగా ఉండాలని సూచించారు.

జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. తమ శాఖలకు సంబంధించిన వివరాలు, అభివృద్ధి అవకాశాలు, అమలు చేయాల్సిన కార్యక్రమాలతో సమగ్ర ప్రణాళిక తయారీకి సహకరించాలని సూచించారు. జిల్లా ఆర్థికాభివృద్ధి, ప్రజల ఆదాయ పెంపు, ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ నిర్దేశిత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ అభివృద్ధి గ్రూపుల నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు



## మండలంలో నేడు విద్యుత్ వినియోగదారులకు స్వల్ప అంతరాయం

**చిలుకూరు, అక్టోబర్ 27:(వుదయం)**

మండలంలోని 33/11 కేవీ చిలుకూరు సబ్‌స్టేషన్ పరిధిలో సోలార్కు సంబంధించిన విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు చేపట్టనున్నందున, నేడు బుధవారం ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు చిలుకూరు సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబ డుతుంది. కావున, విద్యుత్ వినియోగదారులు, రైతులు మరియు పారిశ్రామిక వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నాము. విద్యుత్ లైన్ల పనులు సురక్షితంగా, సకాలంలో పూర్తి చేయడానికి విద్యుత్ శాఖకు సహకరించ గలరని తెలియపరుస్తూ వివరించారుపనులు పూర్తయ్యే సమయాన్ని బట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో మార్పులు ఉండవచ్చు అని చిలుకూరు విద్యుత్ శాఖ ఏఈ తెలియపరిచాడు,

## పెద్దగట్టుపై యాదవులదే ఆధిపత్యం కావాలి!

- రాష్ట్ర పండుగగా ప్రకటించి రూ.100 కోట్లు మంజూరు చేయాలి
- ప్రభుత్వానికి యాదవ నేతల అల్టిమేటం



**సూర్యాపేట అక్టోబర్ 28 , వుదయం ప్రతినిధి**

యాదవుల ఆరాధ్య దైవమైన శ్రీ లింగమంతుల స్వామి పెద్దగట్టు జాతర నిర్వహణపై పూర్తి అధికారాన్ని యాదవులకే కల్పించాలని యాదవ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తగుళ్ల జనార్దన్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్, బీసీ రాష్ట్ర నాయకులు వట్టే జానయ్య యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పెద్దగట్టు జాతరను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించాలని, జాతర అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, భక్తుల సౌకర్యాల కోసం రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జాతర నిర్వహణకు ముందుగా ప్రభుత్వం ప్రత్యేక క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేసి జాతర ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు. పెద్దగట్టు జాతర కేవలం ప్రాంతీయ ఉత్సవం కాదని, యాదవుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని అన్నారు. ఆరు రాష్ట్రాల నుండి 30-40 లక్షల మంది భక్తులు హాజరయ్యే ఈ మహా జాతరకు రాష్ట్ర పండుగ హోదా కల్పించి శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు.

**యాదవులను పేరుకే చైర్మన్లుగా నియమిస్తున్నారు...**

యాదవులను కేవలం పేరుకే చైర్మన్లుగా నియమించి, అసలు పెత్తనం, కీలక నిర్ణయాలు ఇతరుల చేతుల్లో పెట్టడం సరికాదని మండిపడ్డారు. యాదవుల ఓట్లు, మద్దతు కావాలి కానీ, యాదవుల ఆరాధ్య దైవం జాతరలో యాదవులకు అధికారం ఇవ్వకపోవడం ఏం న్యాయమని ప్రశ్నించారు. ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించకపోతే, రాబోయే ఎన్నికల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో యాదవులు రాజకీయ చైతన్యం తీసుకొస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వజ్జే వీరయ్య యాదవ్, మతకాల చలపతిరావు యాదవ్, మద్ది శ్రీనివాస్ యాదవ్, వల్లాల అచ్చయ్య పరంధాములు యాదవ్, నారబోయిన వెంకట్ యాదవ్, దాసరి వెంకన్న యాదవ్, మన్నె యాదగిరి యాదవ్, తూముల వెంకన్న యాదవ్, బయ్య మల్లికార్జున్ యాదవ్, ముద్ద బిక్షపతి యాదవ్, బడుగుల నాగార్జున యాదవ్, ఆవుల అంజయ్య యాదవ్, ఉప్పుల రమేష్ యాదవ్, వర్రె కవిత యాదవ్, కోడి లింగయ్య యాదవ్, ఏర్పుల రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

